# షాహీనా

ఐ. భారతీ శర్మ

**"ఇదర్ బైఠోసాబ్" ప్రక్కనే చోటు చూపించాడు. అతను చూపిన సీట్లో సూట్‌కేస్ కింద పెట్టి కూర్చున్నాను.**

**రైలు వేగాన్ని పుంజు కుంది. వెనక్కి పరుగెడుతోన్న ప్రకృతిని పరికిస్తోన్న నన్నుద్దేశించి ఆ అపరచిత వ్యక్తి మళ్ళీ పలకరించాడు. "సాబ్, మిమ్మల్నెక్కడో చూసినట్లుంది. ఎక్కడిదాకా మీ ప్రయాణం?"**

"వరంగల్."

అతను నన్ను పరిశీలనగా చూస్తూ "మీరు అన్వర్‌సాబ్ కొడుకు కదూ?" అడిగాడు.

"అవును మీ కెట్లాతెలుసు?"

"అరే మాకు మీ నాన్నగారు చాలా పరిచయం. మేము కాజీపేట వచ్చేసి కొన్నేళ్ళయ్యింది. అదివరకు మాదీ వరంగలే."

మా సంభాషణంతా ఉర్దూలోనే జరుగుతోంది. అతను పూసుకున్న సెంటు అతని బట్టలనిబట్టి అతను ఏ మస్కట్‌నుండో, దుబాయి నుండో వచ్చిన శాల్తీ అని తెలుస్తూనే ఉంది.

"కాజీపేటలో మీరేమిచేస్తుంటారు?" అన్నా.

"బిజినెస్ సాబ్. నాపేరు రసూల్ భాయ్" అన్నాడు పాన్ నములుతూ. నా వంక అంత సునిశితంగా అతను చూడటం నాకు బాగాలేదు. మళ్ళీ కిటికీ వేపు ముఖం తిప్పి కూర్చున్నా.

"సాబ్ మీకు అన్సారిసాబ్ తెలుసా?"

ఆ ప్రశ్నతో మళ్ళీ ఇటు తిరగాల్సి వచ్చింది. "తెలుసు!" అన్నాను.

"వాళ్ళ ఇల్లు మీ ఇంటికి కాస్త దగ్గరే కదూ?"

"అవును."

"అన్సారీ వట్టి దగాకోర్ సార్. మూర్ఖుడు. పరమ మూర్ఖుడు."

"ఎందుకూ?" నా ప్రశ్న.

"ఈ రోజుల్లో తాగనోళ్ళుంటారా సాబ్?"

"నిజమే" అన్నాను విసుగ్గా. (నా ఉద్దేశంలో ఉంటారూ... కానీ అతనితో వాదనదేనికి)

"చూడండి సాబ్, మీరు మంచి జాబ్ చేస్తున్నట్లున్నారు. ఏదైనా పార్టీలో మీకు బీర్ ఆఫర్ చేస్తే తాగరా?"

"అఫ్‌కోర్స్."

"నేనిదంతా ఎందుకు చెపుతున్నానంటే, అతనికో బిడ్డ ఉంది షాహీనా. మీరు ఎప్పుడైనా చూశారా?"

"ఎప్పుడో చిన్నప్పుడు చూశా. బక్కగా పీచులా ఉండేది."

"ఛా...ఛా... ఆ పిల్ల ఎవరో సాబ్. వాళ్ళ పెద్ద నాయన కూతురై ఉంటుంది. షాహీనా అందం అద్భుతం. అంత అద్భుత సౌందర్యం మీరెక్కడా చూసుండరు."

నా వళ్ళు మండిపోయింది. లాగి గూబలు పగలకొట్టాలనుకున్నా తమాయించుకుని, "ఆమె అందంతో మీకేం పని?" అన్నా ఆ జిడ్డుకారే ముఖాన్ని అసహ్యంగా చూస్తూ.

"అదేంటి సాబ్ ఆ అందంతోనే నాకు పని."

నేను గతుక్కుమన్నా వీడేమన్నా పిచ్చోడా? అతన్ని నిశితంగా చూశా. అప్పుడే జనగాం స్టేషన్ వచ్చేసింది.

అతను పాన్ నమలటం అయిపోయినట్లుంది. పాన్ పరాగ్ తీసి నాకు కాస్త ఇవ్వబోయాడు. నా అభ్యంతరాన్ని చూసి విస్తుపోతూ" ఇప్పటి వరకూ మీరు సిగరెట్ కూడా తాగలేదు. ఈ పాన్‌పరాగ్ తింటే ఏమవుతుందో?" అన్నాడు.

నా నవ్వే అతనికి సమాధానం.

రైలు కదిలింది. కాస్త రిలాక్సయి కూర్చున్నా.

"సాబ్ ఆమె సంగతి మీకు చెప్పలేదు కదూ?"

కుతూహలంగా అతన్ని చూశా.

"ఆమె నన్ను ప్రేమించింది."

నా ముఖం నల్లగా మాడిపోయింది. బహుశా అతడది గమనించి ఉండడు. చెపుతూనే ఉన్నాడు.

"మా పెళ్ళి కొద్ది రోజులుండనగా గిట్టని వాళ్ళు నేను తాగుబోతునని అన్సారీకి చెప్పారు. పెళ్ళి కాన్సిల్ అని కబురొచ్చింది. అప్పటికి పెళ్ళి రెండే రోజులు. పత్రికలు వెళ్ళాయ్. బంధువులు వచ్చేశారు. మా పరువేం కావాలో? మా బాబాకి చాలా కోపం వచ్చింది. మా చుట్టాల్లోనే ఓ అమ్మాయిని అప్పటికప్పుడు నిశ్చయించి అదే పెళ్ళి సమయానికి పెళ్ళి జరిపించారు. నాకు అన్సారీని నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చింది."

తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ అడిగాను.

"మరి షాహీనా నిన్ను ప్రేమించిందని నీకెలా తెలుసు?"

"అరే! ఆ చూపులూ ఆ చేష్టలూ తేలీవా? భలే పిచ్చోళ్ళు మీ రెక్కణ్ణుంచ్చొచ్చారోగానీ?" అని పిచ్చి చూపొకటి నామీద నిలిపి వెకిలిగా నవ్వాడు.



"ఇప్పటికీ నన్నాపిల్ల ప్రేమిస్తూనే ఉంది" అన్నాడు దిలాసాగా.

నేనొక్కసారి ఉలిక్కిపడ్డాను. ఆ మన్మధాకారాన్ని మరింత నిశితంగా చూశాను.

నల్లని పొగ చూరిన ఆ ముఖం, ఎగదూసిన పళ్ళని తల కట్టూ ఏ ఆడపిల్ల... అతణ్ణి ఎలా ప్రేమిస్తుందో నమ్మకం కుదరలా. అయితే షాహినా ప్రేమ ఆత్మ సంబంధమైందై ఉండాలనుకున్నాను.

అతని ధోరణి అతనిదేలా ఉంది.

"చూడండి సాబ్, మొన్న మా బంధువుల ఇంట్లో పెళ్ళికి మేం వెళితే అక్కడ నన్ను చూసి నవ్వింది. తరువాత కళ్ళనీళ్ళు పెట్టుకుంది. మా పిన్ని కూతురుతో చెప్పిందట. 'నన్ను ఎట్లాగన్నా తీసుకెళ్ళి నిఖా చేసుకోమను రెండో భార్యగా పండుంటా' అనీ. నా భార్యంటే నాకు ప్రేమలేదని కాదు సాబ్ షాహినా అంటే పడిచస్తా. ఆమెకు అన్యాయం చేయను సాబ్ పువ్వుల్లో పెట్టి పూజిస్తా. ఆ ముసిలోడున్నాడే అదే ఆ అన్సారీగాడు... వాడొట్టి దగుల్బాజీ వెధవ. పడనియటం లేదు. నే నెట్లాగైనా షాహినాను తెచ్చేసుకుంటా. సాబ్ మీరు నాకో సాయం చేయగలరా?"



ఏమిటన్నట్లు చూశా.

"మీరీ విషయం అంటే షాహినాను ఎత్తుకుపోయైనా సరే పెళ్ళి చేసుకుంటాననీ బేఫికర్‌గా ఉండమని ఆమెకు చెప్పగలరా? అన్సారీ ఇంటికెళ్ళి మీరీసంగతి ఆ ముసలోడికి తెలీకుండా షాహినాకు చెప్పాలి."

నా జవాబు న గొట్లోనే ఉంది. ట్రైన్ కాజీపేట స్టేషన్‌లో వచ్చి ఆగింది. అతను గబగబా స్టేషన్‌లో దిగిపోయాడు. పీడా వదలిందనుకున్నాను.

"సాబ్" ఉలిక్కిపడ్డాను. ఎదురుగా అతను!

"మళ్ళీ ఏమిటి?" ప్రశ్నార్థకంగా చూశా.

"ఈ స్వీట్ బాక్సు ఆమెకివ్వండి. నేనిచ్చినట్లుగా చెప్పండి."

ఈసారి నాకు నిజంగా వళ్ళు మండుకొచ్చింది. చడామడా తిడదామనుకొన్నాను. కోపాన్ని దిగమింగుకొని "సారీ, నాకు ఇక్కణ్ణుంచి మోసుకెళ్ళటం ట్రబుల్. అక్కడే కొని మీపేరు చెప్తా."

పళ్ళికిలిస్తూ "సాబ్ ఈ డబ్బులుంచండి" అన్నాడు.

అతడి వంక తీక్షణంగా చూశా. అంతే ఆ చేయి వెనక్కు తీసుకుని "మర్చిపోకండి సాబ్ ఆప్‌కో బహుత్ షుక్రియా" అంటూ దిగిపోయాడు.

నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రదేశం అస్తవ్యస్తంగా ఉన్న నా మనస్సుకు కాస్త రిలీఫ్ ఇచ్చింది. ఆ సాయంత్రపు నీరెండలో నా భవిష్యత్ గురించే ఆలోచిస్తూ నడుస్తున్నా.

నేనిప్పుడే పెళ్ళి చేసుకోనంటే బాబాకి కోపం వచ్చింది.

"ఏం? ఎందుకు? ఇంకెప్పుడు చేసుకుంటావ్? పోనీ వాళ్ళని అప్పటి వరకూ ఆగమని చెప్పాలా?" ఇలాటి ప్రశ్నలతో వేధించాడు.

కానీ ఆ పరాధీనను నేనెట్లాపెళ్ళి చేసుకోవాలీ? బాబాకీ విషయం చెప్పేస్తే?

'అర్జంటుగా రా. అన్సారీ గార మ్మాయిని నీవు పెండ్లి చేసుకోవాలి. మీ అమ్మ నీ కోసం చాలా ఎదురు చూస్తుంది.' బాబా వ్రాసిన ఆ ఉత్తరం చూసి నాలుగురోజులు సెలవుపెట్టి మరీ వచ్చాను.

నేనెప్పుడో చిన్నప్పుడు చూసిన షాహినాను ఊహించుకోవాలని ప్రయత్నించాను. కానీ ఆ రసూల్ గాడు ఇచ్చిన చేదు మింగిన తర్వాత ఆ ఊహే మానుకున్నాను.

"అన్సారీగారి ఉప్పుతిని మనం ఇంత వాళ్ళం అయ్యాం. నీవు పెద్ద చదువు చదివి ఇంత పెద్దనౌకరీ చేస్తున్నావంటే అది ఆయన భిక్షే. ఆయన కూతుర్ని చేసుకుని ఆయనకి మనం సాయం చేయపోతే అల్లా మనల్ని క్షమించడు. కొడుకు బుద్ధిమంతుడుకాక ఆస్తంతా పాడుచేశాడు. పిల్లపెళ్ళి ఎలా చేస్తాడూ? ఒకప్పుడాయన లక్షాధికారి. ఇప్పుడు ఏమీలేని బికారి. ఆయన పిల్ల పెళ్ళి చేసి మూతబడ్డ రైసుమిల్లు అమ్మేసి మక్కా వెళ్ళిపోవాలను కుంటున్నారు." అంటాడు బాబా.

బాబా చెప్పిందంతా నిజమే. నేను షాహినాను చేసుకోటానికి సిద్ధమే. కాని ఆమె రసూల్‌కి మనస్సు పారేసుకుంది. ఎంగిలికంచంలో తింటానికి నేనేమీ సిద్ధంగా లేను. పైగా రేపో మాపో వచ్చి వాడు ఆమెను తీసుకెళతానని నాతో సందేశం కూడా పంపాడు.

ఈ సంగతి బాబాతో చెపితే అంతా చెడిపోయినట్లే. షాహినాను కట్టుదిట్టంలో ఉంచుతారు. పైగా నానుండి ఆమెకు దుఃఖమే మిగులుతుంది. మరి ఏమి చేయాలి. దీర్ఘంగా ఆలోచించి నేనో నిర్ణయం తీసుకున్నాను.

సప్తమినాటి చంద్రరేఖ ఆకాశంలోని చుక్కల్ని పోగుచేసుకుంటోంది. ఆ నిర్మానుష్యమైన నిశీధిలో పికిలి పిట్ట గానం శ్రావ్యంగా వినపడుతోంది. 'తూకహా? తూకహా?' అని ఇంటి ముఖం పట్టాను ప్రశాంతంగా.

కాంపౌండ్‌లో ఆడుగుపెట్టిన నాకు అన్సారీగారు ఓ పాత కాలపు ఈజీ ఛైర్‌లో కూర్చుని నా రాకకే ఎదురు చూస్తున్నారు. ఆయన ఎదురుగా అలాంటిదే మరో కుర్చీ, నడుమ ఓ స్టూలూ వేసి ఉంది. నన్ను చూసి ఆప్యాయంగా ఆహ్వానించి కూర్చోమన్నారు.

కొద్దినిముషాలు నా ఉద్యోగం గురించీ, సిటీలోని నీటి ఎద్దడి గురించీ మాట్లాడుకున్నాం. ఆయన లేచి షాహినాను పిలుచుకు వచ్చారు. ఆమె చేతుల్లో ఉన్న టీట్రే స్టూలు మీద పెట్టింది. ఆమె ఓ మెరుపుతీగ. అద్భుత సౌందర్యరాశి అని రసూల్ భాయ్ చెప్పిందాంట్లో అతిశయోక్తి ఏమీ లేదు.

అన్సారీగారు చేతికర్ర తీసుకుని "అలా అన్వర్ దగ్గరకెళ్ళొస్తా" అంటూ వెళ్ళిపోయారు.

మా పెళ్ళిచూపుల సమాగమం ఈ విధంగా బాబానే ఏర్పాటు చేశారు. నామీద ఎవరికీ

అవిశ్వాసం లేదు.

అమెను కూర్చోమన్నాను. చెమ్కీకుట్టిన బంగారు రంగు చీర ముసుగుజారి పోకుండా సవరించుకు కూర్చుంది. వాలిఉన్న ఆమె కనురెప్పలు పద్మంమీద వాలిన తుమ్మెదల్లా ఉన్నాయి. ఆమె చేతుల కున్న ఎర్రమట్టిగాజుల చిరుశబ్దం హృదయలయను తప్పిస్తూంటే, విశాల కుంతలాల్లోని జాజులు పరిమళం వెదజల్లు తున్నాయి.

ఆమె హృదయంలో ఏముందో తెలీదు. చాలా సిగ్గుపడుతున్నట్లు తెలుస్తూనే ఉంది. ఆమె కుసుమకోమల హస్తాలతో నాకు టీ కలిపి ఇచ్చింది. వర్ల మరకూ ఇంటికీ మధ్య నున్న ప్రహరీ గోడ పడిపోయింది. దాని ప్రక్కనే జాజిపందిరి. ఆ ప్రదేశమంతా గడ్డీ, అక్కడక్కడా పిచ్చిమొక్కలు మొలిచి గజిబిజిగా ఉంది. వీటి మధ్యనేనూ, శాపగ్రస్త దేవత షాహినా..

ఏదో లోకంలో ఉన్న నన్ను చూసి షాహినా కళ్ళు దించుకోవడం గమనించకపోలేదు. ఆమెకు ఆ సిగ్గెందుకు? ఆమె వివాహానికి సిద్ధపడిందా? ఆమె హృదయపులోతు మరుక్షణంలో తెలిసిపోతుంది. నా ఒళ్ళో ఉన్న స్వీట్ పాకెట్ ఫక్కున నవ్వినట్లుంది. దాన్నిపడిపోకుండా సరిగ్గా పట్టుకున్నాను. నేను తెచ్చిన సందేశం విని చాలా సంతోషపడిపోతుందా? నన్ను జీవితాంతం జ్ఞాపకముంచుకుంటుందా?

టీ తాగటం పూర్తిచేశాను. షాహినా తనచేతి గోళ్ళను చూసుకుంటూ మౌనంగా కూర్చుంది.

"షాహినాజీ, మీకు రసూల్ భాయ్ తెలుసనుకుంటాను?"

షాహినా నా మాటతో ఉలిక్కిపడి కలవరంగా నావేపు చూసింది. ఆమె భయవిహ్వల కావటం ఎందుకు? తన ప్రణయం నాకు తెలిసిపోయిందనా?

"మిమ్మల్ని ఎలాగైనా సరే వచ్చి తప్పక తీసుకెళ్ళి వివాహం చేసుకుంటానని చెప్పమన్నాడు. మిమ్మల్ని బెంగపడవద్దని చెప్పాడు. ఈ స్వీట్ బాక్స్ మీకు ఇవ్వమని పంపాడు."

పాఠం అప్పుచెప్పినట్లుగా చెప్పి నా దగ్గరున్న స్వీటుబాక్సు ఇవ్వబోయి ఆమె వంక చూశాను. ముఖం పాలి పోయి ఉంది. ఆ ప్యాకెట్ స్టూలుపై ఉంచాను. ఆ ప్యాకెట్‌ని ఓ క్షణం చూసి సర్రున తీసుకుని విసిరిపారేసి రెండు చేతుల్లో ముఖం దాచుకుని ఇంట్లోకి పరిగెత్తింది.

ఆమె చర్యకు దిగ్భ్రాంతుణ్ణయ్యాను. మట్టిలో చెల్లాచెదురైన మిఠాయిలు వెక్కిరిస్తూ కనపడ్డాయి. ఇదంతా ఎందుకు జరిగింది? షాహినా ఎందుకిలా చేసింది; నిశ్చేష్టుణ్ణయి కాసేపు అలాగే నిలబడి ఇంటికి వచ్చేశాను.

నా మస్తిష్కం ఏమీ పని చేయటం లేదు. ఆమెకీ సందేశాన్నంద చేసి సంతోష పరచాలనుకున్నాను. అందరూ నన్ను దోషిగా ఎంచితే... నాకేమీ బోధ పడలేదు.

గదిలో సంధ్యచీకట్లు ముసురుకున్నాయి. కిటికీ కర్టెన్ తొలగించాలని గానీ, లైట్ వేసుకోవాలని గానీ అనిపించలేదు. అచేతనంగా అలా పడి ఉన్నాను. తలుపులు తెరుచుకోవటం, లైటు వెలగటం నేను గమనించలేదు. ఎదురుగా మా చిన్నాన్న కూతురు మహమూదా.

దాన్ని చూసి, లేని నువ్వు పెదాలపై పులు ముకుని నవ్వాను పలకరింపుగా.

"సిగ్గులేదూ? అలా చేయటానికి?"

నా చిరునవ్వుకి దాని సమాధానం అదా! నాకేమీ అంతుపట్టలేదు.

నన్ను కొరకొరా చూస్తూ అంది. "ఒక్క క్షణం నే వెళ్ళక పోతే అది ఉరిపోసుకుచచ్చుండేది" అంది.

దానితో నాకు అర్థమైపోయింది. ఒళ్ళు కంపించింది.

"ఏమిటి మహమూదా నీవనేదీ?"

"నీవు చేసిన నిర్వాకం ఏమిటి? అంత మంచి పిల్లను పట్టుకుని అలా అవమానిస్తావా?"

"ఇందులో నేనవమానించిందేముంది? ఆమె మనసిచ్చిన వారిసమాచారం తేవటంతప్పా?"

"యూ షటప్" అంది.

దాని కోపానికి నవ్వూ ఏడుపూ వచ్చింది. బెడ్ పక్కనున్న కుర్చీమరింత దగ్గరగా జరిపి కూర్చుంటూ గొంతు తగ్గించి మాట్లాడటం మొదలెట్టింది.

"భయ్యా, నీకు వాడు అదే ఆ రసూల్ రాస్కెల్ ఎక్కడ కలిసాడు?"

అంతా చెప్పాను.

"షాహినా వాళ్ళ అన్నలేడూ. ఆ తాగుబోతు వెధవే చేశాడిదంతా. రసూల్‌గాడు మస్కటెళ్ళి డబ్బు సంపాయించి ఇప్పుడేదో బిజినెస్ పెట్టాడట. వీడూ వాడూ ఫ్రెండ్సు. చెల్లెల్ని చూపించడానికి వాణ్ణి తీసుకొస్తే అన్సారీగారు వాణ్ణీ, వీణ్ణి తిట్టి వెళ్ళగొట్టారు. అదీ సంగతి. ఆనాటి నుండీ రసూల్ పగపట్టాడు. షాహినాకొచ్చిన సంబంధాలన్నీ ఎలా తెలిసేవో ఏమోగాని ఇలాగే ఏదో చెప్పిచెడగొట్టేవాడు. నీ సంగతి కూడా ఎవరో చెప్పుంటారు. నీ మనస్సులో కూడా విషం పోశాడు."

నేను దిగ్భ్రాంతిగా వింటూంటే ఇంకా ఇలా చెప్పింది.

"భయ్యా, షాహినాకు నీవంటే చాలా ఇష్టం. ఆ ఇష్టాన్ని నేను చాలాసార్లు గమనించాను. అన్సారీగారికి కూడా నీవంటే చాలా అభిమానం. యోగ్యుడివనీ, బుద్ధిమంతుడివనీ తనబిడ్డకు తగినవాడివని అనుకుంటూ ఉండేవాళ్ళు వాళ్ళిప్పుడు చాలా పేదరికంలోఉన్నారు. మా అమ్మాయిని మీ అబ్బాయికి చేసుకోమని అడిగి, కాదని పించు కోవాలేమోనని ఆయన అభిమానపడ్డారు. ఆయన మనోగతాన్ని పసిగట్టే, షాహినాను తనకోడలిగా చేసుకోవడానికి మనబాబా నిర్ణయించారు."

అంతా విన్న నా మనసు సిగ్గుతో, పశ్చాత్తాపంతో కృంగిపోయింది. షాహినా దుఃఖవదనం నన్ను కలవర పెడుతోంటే గట్టిగా కళ్ళుమూసుకున్నాను.

"మహమూదా, నాకోసాయం చేసి పెడతావా?"

ఏమిటన్నట్లు చూసింది.

"ఈ రాత్రి ఆమెను నే నెట్లాగూ కలవలేను. నా తరపున నీవెళ్ళి క్షమాపణకోరు. రేపటి వరకూ నేను ఆగలేను."

దానికి అది కిలకిలా నవ్వుతూ "భలేవాడివి భయ్యా! నీ తరపున నేనెందుకూ? స్వయంగా నీవే చెప్పు." "ఇప్పుడదెలా సాధ్యం?"

"ఇప్పుడామె మా ఇంట్లోనే ఉంది. పక్కనేగా. రా' అని చెయ్యిపట్టి లాక్కుపోయింది.

తన గదిలో ఆమె ఉన్నట్లు సైగచేసి కర్టెన్ తొలగించి నన్ను లోపలికి పంపుతూ, "నేను టీ తీసుకొస్తా" అంటూ తుర్రున వెళ్ళిపోయింది.

నా అలికిడి విని బెడ్‌పై కూర్చుని ఉన్న షాహినా తొట్రుపాటుతో లేచి తల వంచుకు నిలబడింది. నేనామె దగ్గరగా వెళ్ళి ఆమె చుబుకాన్ని ఎత్తి ముఖం నావేపు తిప్పుకుని "క్షమించు" అన్నా.

ఏడ్చి అలసిన ఆమె కన్నుల్లో వెన్నెలలు విరిసింది. అప్పుడే విచ్చుకున్న ఎర్రగులాబీల్లాంటి ఆ అధరాల్ని చుంబిస్తూ ఆమెను నా హృదయానికి గట్టిగా హత్తుకున్నా.

ఆమె లతలా నన్నల్లుకు పోయింది.

* * *